

ఎరువుల దుకాణాల తనిఖీ

ముథోల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో గల ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ముథోల్ ఎస్సై బిట్లపెర్సెస్, వ్యవసాయ అధికారి రచనలు సోమవారం తనిఖీ చేశారు. పురుగుమందులు, ఎరువులను పరిశీలించారు. పలు వివరాలను మన గ్రోమోర్ మేనేజర్ యోగేష్‌ని అడిగి తెలుసుకున్నారు. ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని సూచించారు. మన గ్రోమోర్ ఏరియా మేనేజర్ నారాయణ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ బి. రాకేష్ తదితరులు ఉన్నారు.

పొలిటికల్.. సీన్ రివర్స్!



- స్థానికంలో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధాన పోటీ
- నాడు ప్రధాన పక్షంగా ఉన్న బీఆర్ఎస్ నేడు విలవిల
- అస్తిత్వం కాపాడుకునే ప్రయత్నాల్లో బీఆర్ఎస్
- ఐదేళ్లలోనే పరిస్థితులు తారుమారు
- స్థానికం కోసం ముందస్తుగా సిద్ధమవుతున్న హస్తం, కమలం పార్టీలు

నిర్మల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కేవలం రెండేళ్లలోనే రాజకీయ పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా వ్యాప్తంగా తన రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించి కాంగ్రెస్, బీజేపీలకు ప్రధాన ప్రత్యర్థిగా కొనసాగింది. గత ఐదేళ్ల క్రితం జరిగిన స్థానిక ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్ జిల్లా పరిషత్ పీఠాన్నే కాకుండా మెజార్టీ ఎంపీపీ పదవులను అలాగే మున్సిపల్ ఛైర్మన్ పదవులను దక్కించుకొని తన రాజకీయ పరంపరకు అడ్డు లేదన్న సంకేతాలను పంపింది. అప్పట్లో బీఆర్ఎస్ ఊపు ముందర జిల్లాలో మొన్నటి వరకు రాజకీయంగా ఎదురీదిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రస్తుతం ప్రధాన ప్రత్యర్థులుగా ఎదగడమే కాకుండా బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా వెనక్కి నెట్టేశాయి. రాబోయే స్థానిక ఎన్నికల్లో నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే కొనసాగుతుందంటూ ప్రచారం ఇప్పటికే మొదలైంది. కొంత మేరకు ఖానాపూర్‌లో మాత్రం బీఆర్ఎస్ పార్టీ తన అస్తిత్వాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అక్కడి జనం నుంచి మాత్రం ఆశించిన మేరకు సానుభూతి లభించడం లేదంటున్నారు. కాగా ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో మాత్రం బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా వెనకబడిందని ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్నట్లయితే కాంగ్రెస్, బీజేపీల మధ్యనే హోరాహోరీ పోటీ నెలకొనే అవకాశాలున్నాయని అంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఈ రెండు పార్టీలే తమ రాజకీయ కార్యకలాపాలను ముమ్మరంగా కొనసాగిస్తూ రాబోయే స్థానిక ఎన్నికల కోసం ముందస్తుగా సిద్ధమవుతున్నాయి. రెండేళ్ల క్రితం వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అన్ని తానై వ్యవహరించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలను లెక్కలోకి తీసుకోలేదు. ప్రస్తుతం మాత్రం పరిస్థితి రివర్స్ అయ్యింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్ పార్టీని పరిగణలోకి తీసుకోకుండా తమ మధ్యనే ప్రధాన పోటీ కొనసాగబోతుందన్న సంకేతాలను చూపుతున్నాయి. రాబోయే స్థానిక ఎన్నికల్లో గతానికి భిన్నంగా బీజేపీ దూసుకుపోయేందుకు ప్రయత్నిస్తుండగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో గెలుపు సాధించి తన సత్తాను నిలుపుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

ఈసారి అన్ని స్థానాలపై బీజేపీ గురి

బీజేపీ గతానికి భిన్నంగా ఈ సారి స్థానిక ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి సారిస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు గానూ రెండు నియోజకవర్గాల్లో భారీ మెజార్టీ ఓట్లతో గెలుపు సాధించిన బీజేపీ అదే ఊపుతో లోక్‌సభ ఎన్నికల్లో కూడా పెద్ద సంఖ్యలో ఓట్ల మెజార్టీని సాధించింది. అప్పటి నుంచి దూకుడును పెంచుతూ ప్రధాన రాజకీయ పక్షంగా ఎదిగేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు క్రమంగా ఫలిస్తున్నాయని అంటున్నారు. జిల్లాలో మొన్నటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొనగా ఈసారి మాత్రం అందుకు భిన్నంగా బీఆర్ఎస్ పార్టీని పక్కన పెట్టి బీజేపీ, కాంగ్రెస్‌తో అమీతుమీకి సిద్ధమవుతోంది. గత ఆరు నెలల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకత్వం కూడా జిల్లాలో జరగబోయే స్థానిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని కార్యకలాపాలకు ప్రణాళికలు రూపొందించింది. దీనికి అనుగుణంగానే జిల్లాకు ప్రత్యేక ఇన్‌చార్జీని నియమించడమే కాకుండా మండలాలు, గ్రామ పంచాయతీల వారీగా సైతం ఇన్‌చార్జీలను నియమించి నిత్యం ఏదో ఓ కార్యక్రమం పేరిట పార్టీని జనానికి మరింత చేరువ చేసే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇమేజ్‌ను జనంలోకి ఎక్కువగా ఫోకస్ చేస్తూ సెంటిమెంట్‌ను అస్త్రంగా మలుచుకోవాలని బీజేపీ తన వంతు ప్రయత్నాలు సాగిస్తోంది. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఈ సారి ఇదే సెంటిమెంట్‌ను అస్త్రంగా మలుచుకొని మెజార్టీ సీట్లు కైవసం చేసుకోవాలని కమలం పార్టీ అగ్రనేతలు వ్యూహరచన చేస్తున్నారు. మెజార్టీ జడ్పీటీసీ స్థానాలను దక్కించుకొని జిల్లా పరిషత్ పీఠాన్ని ఎలాగైనా కమలం ఖాతాలో వేసుకోవాలన్నదే ఆ పార్టీ నేతల ప్రధాన వ్యూహంగా మారిందని అంటున్నారు. మొత్తానికి బీఆర్ఎస్ పార్టీని పక్కన నెట్టేసి బీజేపీ ఈ సారి కాంగ్రెస్ పార్టీకి సమీప ప్రత్యర్థిగా మారబోతుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సవాల్‌గా తీసుకోబోతున్న కాంగ్రెస్ పార్టీ

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం స్థానిక ఎన్నికలను సవాలుగా తీసుకుంటోంది. అయితే మొన్నటి వరకు తమకు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ జిల్లాలో బలహీన పడ్డప్పటికీ బీజేపీ విశేషంగా పుంజుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించు కోలేకపోతోంది. జిల్లాలో సెంటిమెంట్ బలంగా ఉన్న కారణంగా బీజేపీని ఎలాగైనా ఓడించి తాము పై చేయి సాధించాలని కాంగ్రెస్ భావిస్తోంది. అధికారంలో ఉండి పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుండడం తమకు కలిసివస్తుందని ఆశాభావంతో ఉన్నారు. మొన్నటి వరకు రైతుల్లో అసంతృప్తికి కారణమైన రైతు భరోసా నిధులను సైతం వారి ఖాతాల్లో జమ చేయడంతో ఇక తమకు ఎక్కడ కూడా అసమ్మతి గాని అసంతృప్తికి గాని ఎదురుకాకపోవచ్చని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తోంది. అన్ని వర్గాలకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్న కారణంగా వారి ఓట్లన్నీ స్థానిక ఎన్నికల్లో తమకే దక్కవచ్చంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఆ పార్టీలో కొంత మేరకు ఉన్న అసంతృప్తి స్థానిక ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చని చెబుతున్నారు. అయితే స్థానిక ఎన్నికలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకుంటుండడమే కాకుండా గెలుపును ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. స్థానిక ఎన్నికలు రాబోయే రాజకీయ కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తోంది. బీజేపీ ఈ ఎన్నికల్లో విజయం సాధించి ఆధిపత్యం దక్కించుకున్నట్లయితే భవిష్యత్‌లో తమ పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలుంటాయని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జడ్పీ ఛైర్మన్ పదవితో పాటు మూడు మున్సిపల్ ఛైర్మన్ పదవులను, మెజార్టీ ఎంపీపీ పదవులను కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది.

అర్హులందరికీ రేషన్‌కార్డులు

- బీజేఎల్పీనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



పంపిణీ చేస్తున్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే

నిర్మల్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 1050 మంది లబ్ధిదారులకు వెంగ్వాపేట్ గ్రామ మున్నూరు కాపు సంఘం లో కొత్త రేషన్‌కార్డులను బీజేఎల్పీనేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుపడుతుందని, 5 ఏండ్లుగా దేశ వ్యాప్తంగా ప్రజలకు ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు అవసరం ఉందని, పెన్షన్ రావాలన్న, సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్న రేషన్ కార్డు అవసరం తప్పనిసరి ఉందని, ఇంకా రేషన్ కార్డు లేనివారు తప్పనిసరి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, జమాల్, వెంకట్ రెడ్డితో పాటు ఆర్డీవో రత్న కళ్యాణి, ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రం సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం అర్హులైన లబ్ధిదారులకు తెల్లరేషన్‌కార్డులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వేల 118 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని గత కొద్ది సంవత్సరాలుగా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ఇది శుభపరిణామం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం గత 5 సంవత్సరాలుగా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు తెల్లరేషన్ లేకపోవడం వల్ల అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు. రేషన్‌కార్డులు లేని అర్హులందరు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి ఆయా శాఖల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధికి కృషి

- ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

కుంటాల, జూలై, 28 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంతో పాటు నియోజకవర్గాన్ని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కుంటాలలో ఆయన ఇటీవల నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఉమ్మడి కుంటాల మండలంలో మొత్తం 776 మందికి రేషన్ కార్డులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అనంతరం దౌనెల్లి గ్రామంలో దేవాదాయ శాఖ నిధులు 30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న శివాలయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. రేషన్ కార్డుల విషయానికొస్తే కేంద్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి ప్రతినెల 5 కేజీల బియ్యాన్ని అందజేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం ఒక కేజీ బియ్యం మాత్రమే సరఫరా చేస్తుందన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్, పార్టీ బీజేపీల మధ్య కొంత గందరగోళం నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తానని, మండలంలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్‌లు కమల్ సింగ్, శ్రీకాంత్, ఎంపీడీవో వనజ ఉన్నారు.

పథకాల అమలులో వేగం పెంచాలి

- క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలి
- కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ పథకాల అమలు పక్కాగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ : గడువు చెల్లిన ఎరువులను అమ్మితే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు పరిశీలించారు. వానాకాలం సాగు సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల అవసరాల మేరకు సరిపడే నిల్వలు ఉండేలా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే చర్యలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన, నాణ్యత లేని ఎరువులు లేదా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- ఏఎస్పీ రాజేష్ మీనా



వాహనదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

మామడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. సోమవారం మామడ మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి గ్రామం, ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలన్నారు. జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల దిశానిర్దేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో అనుమతులు లేకుండా నడుపుతున్న 70 ద్విచక్ర వాహనాలు, 01 ఆటో మొబైల్ వాహనాలు స్వాధీనం చేసుకొని సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, మద్యం సేవించి, మైనర్ల చేత వాహనాలు పడపడం నేరం. చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సోన్ ఇన్స్‌పెక్టర్ గోవర్ధన్ రెడ్డి, మామడ ఎస్సై అశోక్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో మీనాక్షి నటరాజన్ పర్యటన

- ఆగస్టు 3,4 తేదీలలో ఖానాపూర్‌లో పాదయాత్ర, శ్రమదానం

నిర్మల్, (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ రాష్ట్ర వ్యవహరాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆగస్టు 3,4 వ తేదీలలో నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. 3వ తేదీన ఆమె ఆర్మూర్ నుంచి సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ నియోజకవర్గానికి చేరుకుంటుంది. పాదయాత్ర నిర్వహించిన అనంతరం ఇక్కడే రాత్రి బసచేస్తారు. 4వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రమదానం నిర్వహించి మూడుగంటలకు కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఇక్కడి నుంచి ఆమె కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జరిగే పాదయాత్రలో పాల్గొంటారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఈ నెల 31 నుంచి ఆమె పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొంటున్న నేపథ్యంలో జిల్లాలో పర్యటించబోతున్నారు. కాగా మీనాక్షి నటరాజన్ వెంట పీసీసీ అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, అలాగే స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కోఆర్డినేటర్లు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఎట్టకేలకు భూ విచారణ

- ధరణి పోర్టల్ పొరపాటు
- 80 ఏళ్ల వృద్ధురాలు రెండేళ్లుగా నిరీక్షణ

నర్సాపూర్(జి), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన గురుకొల్ల అమ్మాయి (80) అనే వృద్ధురాలు తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీదకు వారసత్వ పట్టాగా మార్చుకునేందుకు రెండు సంవత్సరాలుగా నిరీక్షిస్తున్నారు. ధరణి పోర్టల్‌లో జరిగిన సాంకేతిక లోపం కారణంగా ఆమె ఇబ్బందిని ఎదుర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే గురుకొల్ల అమ్మాయి తండ్రి మరణించిన తర్వాత ఆయన పేరుపై ఉన్న భూమిని వారసత్వంగా తన పేరు మీదకు మార్చుకోవడానికి ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ధరణి పోర్టల్‌లో దరఖాస్తు ప్రక్రియలో భాగంగా తండ్రి ఆధార్ కార్డుకు బదులుగా కూతురి (గురుకొల్ల అమ్మాయి) ఆధార్‌కార్డు తప్పుగా పాస్ బుక్కుకు అనుసంధానించారు. దీని ఫలితంగా భూమి వారసత్వ మార్పిడి జరగకుండానే ఆమె పేరు మీద పాస్ బుక్ ఇష్యూ కావడంతో అసలు వారసత్వ పట్టా పొందే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఆమె రెండేళ్లుగా పాస్‌బుక్కు అందుకోలేకపోయారు. భూ భారతిలో దరఖాస్తు చేసుకున్న గురుకొల్ల అమ్మాయి దరఖాస్తుపై సోమవారం అధికారులు స్పందిచారు. గిర్దావర్ నవత జ్యోతి, సర్వేయర్ విలాస్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది నసీరాబాద్ శివారంలోని 272, 233 సర్వే నెంబర్లలో గల ఐదు ఎకరాల రెండు గుంటల భూమిని క్షేత్రస్థాయిలో (మోకాపై) పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు వేసిన పంటలను ధ్రువీకరించి, పై అధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ పరిణామంపై గురుకొల్ల అమ్మాయి హర్షం వ్యక్తం చేశారు. భూ భారతి దరఖాస్తులు త్వరితగతిన విచారణ చేయడంపై ఆమె సంతృప్తిని వ్యక్తం చేస్తూ వీలైనంత త్వరగా పాస్ బుక్కులు అందజేయాలని అధికారులను వేడుకున్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

- ఎఫ్ఆర్వో గీతారాణి



మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో గీతారాణి

దస్తురాబాద్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటిని సంరక్షించడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని కడెం ఎఫ్ఆర్వో గీతారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఈ నెల 29న టైగర్ డే సందర్భంగా విద్యార్థులకు అడవుల సంరక్షణ, టైగర్ డేపై వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ కనీస ఒక్క చెట్టు నాటి పెంచాలి. మన సమాజానికి, భవిష్యత్ తరాల కు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడంలో ఇది కీలకమన్నారు. ఇటీవల కాలంలో చెట్ల నరికివేత పెరిగిపోతుండడంతో వర్షపాతం తగ్గిపోతోందని, ఇది భూమి పొరలు దెబ్బతినడానికి దారితీస్తోందని పేర్కొన్నారు. అడవులను వనరులుగా మాత్రమే కాకుండా జీవనాధారంగా భావించి వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగాధర్, ఎఫ్ఎస్‌వో, కింగ్ ఫిషర్ ఎఫ్‌బీవో, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పంచమి వేడుకలకు ముస్తాబైన నాగదేవత ఆలయాలు

భైంసా, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలోని నాగదేవత ఆలయాలు పంచమి వేడుకల కోసం ముస్తాబు అయ్యాయి. మంగళవారం నిర్వహించే నాగుల పంచమి వేడుకలను పురస్కరించుకొని ఆలయాల కమిటీ నిర్వాహకులు ఘనమైన ఏర్పాట్లు చేపట్టారు. నాగదేవత ఆలయాలను రంగులతో సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. విగ్రహాలను శోభాయమానంగా అలంకరించారు. పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. భైంసా పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరం , మాంజ్రి రోడ్డు మార్గంలోని నాగదేవత ఆలయం , మండల పరిధిలోని సుంక్లి నాగదేవత ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశము ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేపట్టారు.



భైంసా బాగుబాయి గుట్టపై నాగదేవత విగ్రహం

సిరిచెల్మ రోడ్డు నిర్మాణం చేపట్టండి

- పెంబి మండల నాయకుల వినతి



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న మండల నాయకులు

పెంబి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్గంపాండ్రి గ్రామం నుంచి సిరిచెల్మ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో పెంబి మండల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మండలంలోని పుల్గంపాండ్రి నుం చి సిరిచెల్మ వరకు అటవీ ప్రాంతం లో నాలుగు కిలోమీటర్ల దూరంకు అటవీ శాఖ అనుమతులు లేక ఆగిపోయిందని, గత ప్రభుత్వాలు సమస్యలు పట్టించుకోలేదన్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలతో పాటు ఖానాపూర్, కడెం మండల ప్రజలకు ఆదిలాబాద్ జిల్లా వెళ్లడానికి దూరభారం తగ్గుతుందన్నారు. గిరిజన గ్రామాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దూరభారం నుంచి వచ్చే ఉద్యోగులకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, గిరిజన గ్రామాలు అనేక రంగాల్లో వెనుకబడుతున్నాయని, రోడ్డు పూర్తి అయితే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ వెంటనే స్పందించి సర్వే చేసి పోర్టల్ నందు అప్లోడ్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఐదు వెంకటేష్, అరవింద్, సుదర్శన్, రాజు, భూక్యా శ్రీను, మండల, గ్రామ ప్రజలు ఉన్నారు.

బ్రిడ్జి నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తానూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామం , ఝరి తండా గ్రామానికి చెందిన బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు జిల్లా కలెక్టరెట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. వర్షం కారణంగా తమ గ్రామాలకు రాకపోకలు స్తంభించు పోతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జల్లే వార్ శివదాస్, ఆసంమాధవ్, బొడ్డోళ్ల యోగేశ్వర్, గుర్ల యోగేష్, గొడుగు నాగేష్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): దేశ అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైనథ్ మండలంలోని ఆనంద్ పూర్, సాత్నాల మండలం సాంగ్వి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో బిజెపిలో చేరారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్, రమేష్, అశోక్ రెడ్డి, విశాల్, రాకేష్ రెడ్డి, రోహిదాస్, సురేష్, లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలి



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో గల గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం హైదారాబాద్‌లోని డీఎస్ఎస్ భవనంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ 7వ గిరిజన సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మాట్లాడారు. ఇందులో కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎంపీ గోడం నగేష్, తదితరులున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నార్నూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధుల సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్ఈఓ తులసీదాస్, హెల్త్ సూపర్ వైజర్ చరణ్ దాస్ అన్నారు. సోమవారం మండలంలోని యాంపల్లి గ్రామం వద్ద వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేశారు. రోగాలతో బారిన పడిన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలు సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఆడె దినేష్, ఏఎన్ఎం శ్యామకా బాయి, హెల్త్ అసిస్టెంట్ జవహర్, దినేష్, ఆశ మొత్తు బాయి ఉన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

బోథ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సిఇసి ఎంఈసి గ్రూపులలో మిగిలిపోయిన సీట్లకు ఆగస్టు 7న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం.9666525131, 8374361232 ద్వారా సంప్రదించాలని ఆమె కోరారు.

పీజీటీ ఎకనామిక్స్ పోస్టులకు దరఖాస్తు

బోథ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): బూతు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో తొమ్మిదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బోధించేందుకు ఖాళీగా ఉన్న పీజీటీ ఎకనామిక్స్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు గంటల ప్రాతిపదికన పనిచేయుటకై ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఆగస్టు 1వ తేదీ లోపు పాఠశాల యందు దరఖాస్తు అందించాలని, ఆసక్తిగలవారు సెల్ నెం.9666525131, 8374361232 ద్వారా సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆదివాసీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు : సోయం

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆదివాసుల సమస్యలను పరిష్కరించే దిశగా రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ సోయం బాపూరావు శాయ శక్తులా కృషి చేస్తున్నారని సమితి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుర్సంగే తానాజీ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాజ్ గోండ్ సేవాసమితి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయవంతం చేసిన ఆదివాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీల అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి మాజీ ఎంపీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని పునరుద్ఘాటించారు. సమావేశంలో నాయకులు శ్యాం రావు, జగు పటేల్, రాజు పటేల్, శేషారావు, పరుశురాం, సునీల్ పాల్గొన్నారు.

'రాష్ట్ర అధ్యక్షుడిపై ఆరోపణలు చేస్తే ఊరుకోం'

ఉట్నూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ సోయం బాపురావుపై వ్యక్తిగత ఆరోపణలకు దిగితే బాగుండదని ప్రత్యర్థి గిరిజన సంఘాల నాయకులను రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు హెచ్చరించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ ఆదివాసుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావుపై కొందరు పనిగట్టుకొని వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం 49 రద్దు కోసం రాష్ట్రంలోని మంత్రులను, ప్రజాప్రతినిధులను వెంట పట్టుకొని ముఖ్యమంత్రిని కలిసి జీవో 49ని తాత్కాలికంగా రద్దు చేయించిన ఘనత సోయం బాపూరావుది అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం నీరంజన్, నాయకులు ఆత్రం ప్రకాష్, ఆత్రంకాశీరాం, పురుకా గజానంద్, సిడాం కృష్ణ, తొడసం భీమావు, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగించిన నాయకులు

బోథ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం సమీపంలో వై జంక్షన్ వద్ద ముండ్ల పొదలు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వాహనాల వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయం గమనించిన మండల కేంద్రానికి చెందిన బిజెపి నాయకులు జెసిబిని పిలిపించి ముళ్ళ పొదలను తొలగింపచేశారు. దీంతో బిఆర్ఎస్ నాయకుల సామాజిక సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సుధీర్ రెడ్డి, ఈర్ల అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలపై అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా లింగాల చిన్నన్న అన్నారు. ప్రాథమికొన్నత పాఠశాలల్లో రూ. లక్షకు పైగా, ప్రైమరీలో రూ.70 నుంచి రూ.90 వేల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్న డిమాండ్‌తో ఆగస్టు 6న కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తున్నామన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో రేఖ, సునీత, సుమిత్ర, కిష్టమ్మ, భూమక్క, ఆశ్వీని, స్వప్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన

● ఆదిలాబాద్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో కాలేజ్ కౌన్సిల్ ఎలక్షన్‌లు ● పాల్గొన్న విద్యారులు



ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూ లైన్‌లో విద్యార్థులు



ఎన్నికల పోలింగ్ గది

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): సాధరణ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా విద్యా సంస్థల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో కాలేజ్ కౌన్సిల్ ఎలక్షన్‌లను జరిపారు. కెప్టెన్, వైస్ కెప్టెన్ పోస్టులను ఎన్నికలు జరిగాయి. సాధరణ ఎన్నికలను తలపించేలా ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరపగా... విద్యార్థులు క్యూ లెన్ లలో నిలబడి బ్యాలెట్ పద్ధతిన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ హెచ్.వో.డీ లక్ష్మణ్ పుట్ట మాట్లాడుతూ... విద్యార్థులే రేపటి ఓటర్లని, వారికి ఎన్నికల ప్రక్రియ గురించి తెలిసేలా కాలేజ్ కౌన్సిల్ ఎన్నికలు జరిపినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు ప్రాధాన్యత తదితర అంశాలను విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. సాధరణ ఎన్నికల మాదిరిగానే నోటిఫికేషన్, పోలింగ్ వంటివి చేపట్టామని, ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ముంతజ్ బేగం పాల్గొన్నారు. ఎన్నికల పరిశీలకులుగా రామకృష్ణ, వి.విఠల్, శ్రీనివాస్, పీఓగా శ్రీలత, ఏపీఓగా రాజేష్, సురేందర్, ఓపీఓగా సుశీల, శ్రీనివాస్, జితేందర్, అఫ్రీన్ వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటాలి: డీసీసీబీ చైర్మన్

● ఆదిలాబాద్‌లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి సూచించారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో సోమవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను కార్యక్రమ అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు దిశా నిర్దేశం చేశారు. నిరంతర సాధనతో నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆగస్టులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. గతేడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిందని, ఈ ఏడు సైతం అవే ఫలితాలు పునరావృతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, డీవైఎస్‌వో శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కృష్ణ కుమార్, వివిధ పాఠశాల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● నిరుద్యోగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఆదిలాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదన్న మాట అవాస్తవమని, అబద్ధాలు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు యాల్లోయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని బీఆర్ఎస్, బీజేపీ నేతలపై విమర్శలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మసంతోష్, దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, ఇర్ఫాన్, పోతారెడ్డి, ఎంఏ షకీల్ పాల్గొన్నారు.





రైతు వేదికలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్

నూతన రేషన్‌కార్డుల పంపిణీ

నర్సాపూర్(జి), జూలై 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన నర్సాపూర్ మండలంలో సోమవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. ఈ మండలం రెండు వేర్వేరు నియోజకవర్గాలకు చెందిన గ్రామ పంచాయతీలతో ఏర్పడినందున ఒకే రోజు రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రేషన్ కార్డులను పంపిణీ చేయడం విశేషం. నర్సాపూర్ మండలం మొత్తం 13 గ్రామ పంచాయతీలతో ఏర్పడింది. ఇందులో 8 గ్రామ పంచాయతీలు ముథోల్ నియోజకవర్గం పరిధిలోకి రాగా, మిగిలిన 5 గ్రామ పంచాయతీలు నిర్మల్ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. ఈ ప్రత్యేక పరిస్థితుల కారణంగా ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్ గొల్లమాడ గ్రామ రైతు వేదికలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేయగా, నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి స్థానిక రైతువేదికలో కార్డులను పంపిణీ చేశారు.

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

నేరడిగొండ, జూలై 28(ఆంధ్రజ్యోతి): గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సుభాష్ యాకరన్ అన్నారు. సోమవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గంలో గల ప్రతి మండల ముఖ్య నాయకుల సమావేశం రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర ఇంచార్జి సుభాష్ యాకరణ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ప్రజా సమస్యలు తీర్చడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. ఇందులో బోథ్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, బొడ్డు గంగారెడ్డి, సత్యవతి కోటేష్, బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ టౌన్: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ లక్ష్యమని ఆర్జీపీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి సుభాష్ యాకరన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు యాల్లోయాన్ని సందర్శించారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు పూల బొకేలతో ఘన స్వాగతం పలికారు. ఆర్జీపీఆర్ఎస్ ద్వారా గ్రామస్థాయిలో ప్రజల్లోకి వెళ్తూ, వారి సమస్యల్ని తెలుసుకొని వాటిని పరిష్కరించడం ద్వార ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం కలుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆడె గజేందర్, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, మునిగెల విఠల్, కలాల శ్రీనివాస్, రామ్ కుమార్ పాల్గొన్నారు.

కోచింగ్‌సెంటర్ల నిర్వహణపై ఫిర్యాదు

నిర్మల్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు జిల్లా కన్వీనర్ దిగంబర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నవోదయ, సైనిక్, గురుకుల కోచింగ్ సెంటర్ల పైన విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టే చర్యలు తీసుకోవాలన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

ముథోల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆగస్టు 15వ తేదీ లోపు పరిష్కరించాలని పీఆర్టీయూ టీఎస్ సంఘం జిల్లా కార్యదర్శి బీవీ రమణరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ముథోల్ మండలంలోని మచ్కల్, రాంటెక్, ముథోల్‌లోని బాలుర బాలికల గురుకుల పాఠశాలలో సంఘ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని వివరించారు. ఇందులో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే. గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి. రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు పి. ప్రవీణ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆహాద్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి ఎమ్మెల్యే పరామర్శ

భైంసా, జూలై 28(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అస్వస్థత చెందిన మహారాష్ట్ర మాజీ మంత్రివర్యులు, నాందేడ్ మాజీ ఎంపీ డీబీ పాటిల్‌ను సోమవారం ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధుల బృందం పరామర్శించింది. ఇటీవలనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ అయ్యి భైంసాలోని గీతానగర్ కాలనీలోని తన స్వగృహంలో కొలుకొంటున్న మాజీ మంత్రి డీబీ పాటిల్‌ను మాజీ ఎమ్మెల్యే పాటిల్ బృందం కలిసి ఆరోగ్య పరిస్థితుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భైంసా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ సయ్యాజీ బోజరాం పాటిల్, సదాశివ్ పాటిల్, తదితరులు ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కుంటాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): శ్రావణ సోమవారం పురస్కరించుకొని మండల కేంద్రం కుంటాలలోని ఉమామహేశ్వర ఆలయంతో పాటు సూర్యాపూర్ రాజరాజేశ్వ స్వామి ఆలయాల్లో శ్రావణ మాసం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఉదయం నుండే భక్తులు ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ముథోల్: శ్రావణ మొదటి సోమవారంను పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని పురాతన జఠ శంకర్ ఆలయంలో ముథోల్ బొగడ వాడకట్టు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అభిషేకం, పూజ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాలూకా సంఘం అధ్యక్షుడు రోళ్ల రమేష్, రోళ్ల బాలాజీ, తెలగడం ధర్మన్న, హంగిర్గా లక్ష్మణ్, మెంబర్లు వెంకటాపురం పోతన్న, హంగిర్గా భోజన్న, వీడీసీ అధ్యక్షుడు వరగంటి విఠల్, ఉపాధ్యక్షులు పల్లె నగేష్, తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలి'

నిర్మల్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గత ఐదు నెలల నుంచి పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినట్లు జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా కార్యదర్శి కే.రాధ, ఉపాధ్యక్షులు లక్ష్మీ, గంగాధర్, సహాయ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

ముథోల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల, రబింద్ర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ బండెలు నరేష్ సీజన్‌లో వచ్చే వ్యాధుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులు అన్నం తినే ముందు కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పేర్కొన్నారు. అలాగే తగినన్ని నీళ్ల తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, ప్రధానాచార్యులు సారథి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వరల్డ్ విజన్ చేయూత హర్షనీయం'

లక్ష్మణచాంద, జూలై 28(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చేయూతనివ్వటం హర్షనీయమని ఎంపీడీవో రాధా రాథోడ్ సోమవారం అన్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన కొడమంచి గంగామణి కుటుంబానికి వ్యాపార నిమిత్తం వరల్డ్ విజయ్ ఇండియా ఆధ్వర్యంలో రూ.25 వేల విలువగల ఫాన్సీ, స్టీల్ సామన్లు, పలు రకాల వస్తువులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సహాయాన్ని చక్కగా సద్వినియోగ పరుచుకుని పిల్లల చదువుకు, కుటుంబ అభివృద్ధికి వినియోగించుకుని ముందుకు కొనసాగాలని తెలిపారు. ఇందులో గ్రామసభ్యులు, వరల్డ్ విజన్ మేనేజర్ బ్రహ్మన్న, కోఆర్డినేటర్ అరుణ్, వాలంటీర్లు సుమలత, తదితరులు ఉన్నారు.

పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

నిర్మల్ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

పొగాకు రహిత సమాజం కోసం ర్యాలీ

సోన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజ స్థాపన కోసం ప్రతిఒక్కరి భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో సోన్ మండలం పాక్‌పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకన్న మాట్లాడుతూ.. పొగాకు వాడకం వల్ల ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయమని, నేటి యువత, విద్యార్థులు వారి భావి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్ రావు, తోడిశెట్టి రవికాంత్, గటిక రవికాంత్, జువ్వల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నిర్మల్‌రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటిన ఇప్పటి వరకు ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించలేదని విమర్శించారు. ఇందులో ఏఐఎస్ఎఫ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ రఘురాం, కార్యవర్గ సభ్యులు రమేష్, జిల్లా అధ్యక్షుడు రవికాంత్, ప్రధాన కార్యదర్శి కైలాస్, ఉపాధ్యక్షులు అస్లాం, శ్రీకర్, తదితరులు ఉన్నారు.

మిగిలింది 17 రోజులే..

(5వ పేజీ తరువాయి...)

నేతల మద్దతును కూడగడుతూ.. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

పొడగింపునకు అవకాశం

ప్రభుత్వం పీఏసీఎస్‌ల పదవీ కాలాన్ని పొడగించేందుకు అవకాశం ఉందన్న అభిప్రాయాలు ఎక్కువగా వినిపస్తున్నా యి. ఎందుకంటే త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. హైకోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు ముందు సొసైటీలను రద్దు చేస్తే స్థానిక ఎన్నికలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో గడువు సమయాన్ని పొడగించేందుకే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోకుంటే ఉమ్మడి జిల్లాలో వెయ్యి మందికి పైగా డైరెక్టర్లు పదవికి దూరం కానున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా వేల మంది డైరెక్టర్లు పదవులను కోల్పోతారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంటుదని అంచనా వేస్తున్నారు. గ్రామస్థాయిలో సొసైటీ చైర్మన్లు, పలువురు డైరెక్టర్ల పలుకుబడి ఉండడంతో స్థానిక ఎన్నికల ఫలితాలను తారుమారు చేసే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● దేగాం గ్రామ సమీపంలో బైక్-ఆటో ఢీ

● భైంసా శివారులో ఢీకొట్టుకున్న బైక్-ఆర్టీసీ బస్సు

భైంసా, జూలై 28(ఆంధ్రజ్యోతి): భైంసా-బాసర ప్రధాన రహదారి మార్గంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృత్యువాతపడ్డారు. ఆదివారం రాత్రి వేళలో దేగాం గ్రామ సమీపంలో బైక్-ఆటో ఢీకొన్న ఘటనలో ప్రైవేట్ ఉద్యోగి ఒకరు దుర్మరణం పాలయ్యాడు. కుబీర్ మండలంలో గోడపూర్‌కు చెందిన గరికె ప్రవీణ్ (32)భైంసాలో నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి నిజామాబాద్ నుంచి భైంసాకు బైక్‌పై వస్తున్న ప్రవీణ్, భైంసా నుంచి ముథోల్ వైపు వెలుతున్న ఆటో దేగాం-సరస్వతీ నగర్ మార్గంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన ప్రవీణ్ ప్రమాదస్థలిలోనే దుర్మరణం పాలయ్యాడు. భైంసా రూరల్ ఎస్ఐ శంకర్ మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఇక సోమవారం ఉదయం భైంసా పట్టణ శివారులోని సేవాలాల్ చౌక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముథోల్ ఆశ్రమ పాఠశాలకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయుడు ఆడే నరేష్ మృత్యువాత పడ్డాడు. కుబీర్ మండలంలోని సిర్పెల్లి తాండకు చెందిన ఆడే నరేష్ ఉదయం వేళలో విధులకు హాజరయ్యేందుకు గాను స్వగ్రామం నుంచి బైక్‌పై భైంసా మీదుగా ముథోల్‌కు బయలు దేరాడు. ఈ క్రమంలో ఖాన్ ఆటోనగర్ మార్గం మీదుగా భైంసా-బాసర రోడ్డు మార్గానికి చేరుకుంటుండగా నిజామాబాద్ నుంచి భైంసా వైపు వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు, బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో అపస్మారక స్థితికి చేరుకున్న నరేష్‌ను 108లో ఏరియా ఆసుపత్రికి తరలించాడు. బాధితుడికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు మృతి చెందినట్లుగా వెల్లడించారు. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భైంసా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి యువకుడి మృతి

దస్తురాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నీరటి నరేష్(25)కు మండల కేంద్రానికి చెందిన ఓ యువతితో మూడు నెలల క్రితం వివాహమైంది. అయితే వివాహం జరిగిన కొద్ది రోజుల నుంచి భార్య ఆరోగ్యం బాగుండడం లేదు. ఎక్కడికి తీసుకెళ్లినా ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా భార్య ఆరోగ్యం మెరుగుపడటంలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నరేష్ ఈ నెల 25న పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు వారు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో 13 గొర్రెల మృత్యువాత

ఆదిలాబాద్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద రూరల్ మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన లాయిరి కిష్టయ్య గొర్రెల కాపరికి చెందిన 13 గొర్రెలు ఆదివారం కుక్కలు దాడిలో మృత్యువాత చెందాయి. చేసి చంపేయడం జరిగింది. కిష్టయ్య తన గొర్రెలను ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని దొడ్డిలోకి తోలాడు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గుంపుగా గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 13 గొర్రెలు మృతి చెందగా నాలుగు గొర్రెలు గాయపడ్డాయి. సోమవారం ఉదయం కిష్టయ్య గొర్రెల దొడ్డి వద్దకు వచ్చి బోరున విలపించాడు. సుమారు రూ.లక్ష యాభై వేలకు పైగానే నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. కాగా, గ్రామాలలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు మితిమీరి పోతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

తాంసిలో లేగదూడపై చిరుత దాడి

తాంసి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలో లేగదూడపై చిరుతపులి పంజా విసరడం స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. మండలంలోని లింగూడ గ్రామానికి చెందిన బాధిత రైతు తుంరం సూరజ్ వివరాల ప్రకారం ఆవు, లేగ దూడ, ఎద్దులు ఆదివారం సాయంత్రం మేత మేస్తున్న క్రమంలో చిరుత పులి దాడి చేయగా స్థానికంగా ఉన్న కుక్కలు, ఎద్దు అరచి తరమడంతో వెళ్లిపోయిందని తెలిపారు. ఈ దాడిలో లేగదూడకు స్వల్ప గాయాలై ప్రాణాలతో బయట పడిందని పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన వారికి జైలు

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించిన అయిదుగురికి ఆరునెలల సాధరణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ స్పెషల్ సెషన్ కోర్టు న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే... బేల మండలం టాక్లి గ్రామానికి చెందిన బాధితుడు కనక మారుతి తాను కౌలుకు తీసుకున్న చేనులో విత్తనాలు వేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బండేకర్ సకారాం, బండేకర్ శంకర్, బండేకర్ మంగేష్, బండేకర్ తేజేష్, బండేకర్ మంగల కలిసి విత్తనాలు వేయకుండా అడ్డుపడ్డారు. కులం పేరుతో తిట్టి దాడికి పాల్పడ్డారు. 2023లో ఈ ఘటన జరగగా... బేల పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ వి.ఉమేందర్ విచారణ జరిపి చార్జ్ షీట్ దాఖలు చేయగా, లైజన్ ఆఫీసర్ జి.పండరి, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి ఎంఏ జమీర్ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. పీపీ ముస్కు రమణ రెడ్డి నేరాన్ని రుజువు చేయించగా స్పెషల్ సెషన్ కోర్ట్ న్యాయాధికారి కుమార్ వివేక్ తీర్పు వెలువరించారు. సాక్షులను ప్రవేశ పెట్టడంలో, కేసు విచారణ చేయడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధులపై ఆవు దాడి : ఆస్పత్రికి తరలింపు

బోథ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రోడ్లపై తిరుగుతున్న పశువులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులుగా రోడ్లపై తిరిగే ఆవులు ప్రజలపై దాడి చేసేందుకు వెనకడం లేదు. దీంతో ఆవుల మందను చూసిన పట్టణ ప్రజలు దూరంగా వెళ్లిపోతున్నారు. సోమవారం 14వ వార్డులోని రాథోడ్ విట్టల్(70) అనే వృద్ధుడిపై ఆవు దాడి చేసింది. దీంతో వృద్ధుడికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

డీసీఎం డోర్ తెరవడంతో ప్రమాదం

నర్సాపూర్(జి), జూలై 28(ఆంధ్రజ్యోతి): డీసీఎం కంటైనర్ డ్రైవర్ విద్యుత్ వైర్‌కు తగులుతుందనే భయంతో అకస్మాత్తుగా డోర్ తెరవడం వల్ల జరిగిన ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన కే. సుబ్బారెడ్డి(65), అతని మనుమరాలు స్నేహ(13) గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం ఉదయం నర్సాపూర్(జి) మండల కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కే. సుబ్బారెడ్డి తన మనుమరాలు స్నేహను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పాఠశాలకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారు. అదే సమయంలో సమగ్ర శిక్షణ సెంట్రల్ గవర్నమెంట్ హైదరాబాద్ నుంచి మండల కేంద్రానికి నాలుగు కంప్యూటర్ సిస్టమ్స్‌ను డీసీఎం కంటైనర్‌లో తీసుకువస్తున్నారు. డీసీఎం కంటైనర్ పైనున్న విద్యుత్ వైర్‌కు తగులుతుందేమోనని డ్రైవర్ అకస్మాత్తుగా కంటైనర్ ముందరి డోర్ తెరిచాడు. ఈ క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను నర్సాపూర్‌లోని 30 పడకల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్ చంద్ర వారికి చికిత్సలు అందించారు.



నాట్లు వేస్తున్న కూలీలు

నాట్లు ముమ్మరం

- బిహార్ కూలీలతో తెలంగాణ రైతులకు ఊరట
- ఆడ వారికి దీటుగా నాట్లు వేస్తున్న మగ కూలీలు

నర్సాపూర్(జి), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వానాకాలం మొదలు అవ్వడంతో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో అధిక వర్షాలు కురవడంతో పాటుగా జల వనరులు పుష్కలంగా ఉన్న ప్రాంతాలలో డీపీపీ పద్ధతిలో వరి సాగు చేయడానికి నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఈసారి వరినాట్ల విషయంలో ఒక ఆసక్తికరమైన దృశ్యం చోటుచేసుకుంది. కూలీల కొరత కారణంగా బీహార్ నుంచి వచ్చి కూలీలు తెలంగాణ కూలీలతో కలిసి వరినాట్లు పోటాపోటీగా వేస్తున్నారు. ముఖ్యంగా బీహార్ నుంచి వచ్చిన మగ కూలీలు కూడా ఆడవారి మాదిరిగానే సమర్థవంతంగా నాట్లు వేయడం రైతులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వీరి పనితీరుపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా వరినాట్లు వేయడంలో మహిళా కూలీలు ముందుంటారు. అయితే ఈసారి బీహార్ మగ కూలీలు వారిని తలదన్నే విధంగా నాట్లు వేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం ఒక పొలంలో దాదాపు 30 మంది రైతులు నాట్లు వేస్తుండగా తీసిన చిత్రం కూలీలంద రూ కలిసికట్టుగా పని చేస్తున్న తీరును తెలియజేస్తోంది. కూలీల కొరత ను తీర్చడానికి బీహార్ కూలీలు ఎంతగానో ఉపయోగపడుతున్నారని రై తులు పేర్కొంటున్నారు. వీరు ఎకరానికి రూ. 5,500ల కూలీ తీసుకుంటున్నట్లు కూడా వెల్లడించారు. వానా కాలంలో నాట్లు పూర్తవ్వడానికి ఈ బీ హార్ కూలీలు ఎంతగానో సహాయపడుతున్నారని రైతులు సంతోషం వ్య క్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

గుట్టరాళ్లు కూలాయి.. ప్రమాదంగా మారాయి

బజార్‌హత్నూర్, జూలై28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపూర్ గ్రామ సమీపంలో వర్షానికి గుట్టరాళ్లు కూలడంతో రోడ్డుపై ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ, టెంబి, గుడిహత్నూర్ మీదుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి పదుల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రెండు రోజులుగా ఈ రాళ్లు కూలిపోయి రోడ్డు పై పడి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు వీటిని తొలగించి రవాణా సౌకర్యం మెరుగు పర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌కు పులులు వచ్చేనా?

- నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



జాతీయ జంతువు పెద్దపులి (ఫైల్)

ఉట్నూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లోకి పులులు వచ్చేనా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకుని ఈ కథనం.. రూపంలో రాజసం, చూపుల్లో గాంభీర్యం, గాండ్రింపుతో భయం భయం కల్పించే పెద్దపులుల కోసం ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలో 2012లో కవ్వాల్ టైగర్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. ప్రాణహిత, గోదావరి నదుల మధ్యన ఉన్న అటవి ప్రాంతంలో మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అడవులను కలుపుకొని ఏర్పాటు చేసిన టైగర్‌జోన్‌లో 300 నుంచి 400 హెక్టార్లలో బఫర్, కోర్ ఏరియాలను గుర్తించారు. కడెం మండలంలోని దోస్తునగర్ ప్రాంతంలో లవ్ కవ్వాల్ పేరు తో కవ్వాల్ టైగర్‌లోగో ఏర్పాటు చేయడంతో పర్యాటకులు ఈ ప్రాంతంలో సందర్శించినప్పుడు కవ్వాల్ టైగర్ లోగో వద్ద ఫోటోలు దిగుతున్నారు. పులులకు ఆహారం అందించడానికి శాఖాహార జంతువులను కూడా పెంచుతున్నారు. జ న్నారంలో ఏర్పాటు చేసిన జింకల పార్కును పర్యాటకులు సందర్శిస్తున్నారు. కవ్వాల్ టైగర్ జోన్ ప్రాంతంలోని అడవుల్లో పచ్చగడ్డిని పెంచుతు నీటి వసతులు కల్పిస్తూ శాఖాహారా జంతువులను అటవి శాఖ వన్య ప్రాణి విభాగం ఆధ్వర్యంలో పెంపుదల చేస్తున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలోని అడవుల్లోకి సరిహద్దున గల మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్ పులుల సంరక్షణ కేంద్రాల నుంచి తరచుగా ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ ప్రాంతంలోకి పులులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నాయి. కాని ఆదిలాబాద్ అడవుల్లోని కవ్వా ల్ టైగర్‌జోన్‌లో మాత్రం ఇంత వరకు పులులు మఖాం వేసుకోలేదని చెప్పవచ్చు. 1972లో భారత ప్రభుత్వం పులిని జాతీయ జంతువుగా ప్రకటించింది. అంతరించి పోతున్న పులులను సంరక్షించాలన్నా ఉదేశంతో 1973లో ప్రభుత్వంలో ప్రాజెక్టు టైగర్‌ను ప్రారంభించింది. పెద్దపులిని రాయల్ బెంగాల్ టైగర్ అని అంటారు. 1972లో జాతీయ జంతువుగా పులిని గుర్తించారు. అంతకు ముందు ఈ స్థానంలో సింహం ఉండేదని పేర్కొంటున్నారు. ప్రతీ యేడాది జూలై 29ని అంతర్జాతీయ పులుల దినోత్సవంగా జరుపుతున్నారు. భారత్‌లో మొదటి టైగర్ రిజర్వ్‌గా ఉత్తరాఖండ్‌లోని జిమ్‌కార్బెట్ జాతీయ పార్కును ఏర్పాటు చేశారు. పులులను ప్రతీ నాలుగేళ్లకోసారి లెక్కిస్తారు. దేశంలో అత్యధిక పులుల సంరక్షణ కేంద్రాలు మధ్యప్రదేశ్ (6)లో కవు. 2018 లెక్కల ప్రకారం మధ్యప్రదేశ్‌లో 526 పులులు, కర్ణాటకలో 524, ఉత్తరాఖండ్‌లో 440, మహారాష్ట్రలో 312, తమిళనాడులో 224 పులులు ఉన్నట్లుగా గుర్తిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్‌జోన్ ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం (నాగార్జున సాగర్) టైగర్ రిజర్వులు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 26 పులులు, ఆంధ్రప్రదేశ్‌లో 48 పులులు ఉన్నట్లు తెలుస్తుంది.

అగ్రి డాక్టర్ల సలహా.. పంట ఆరోగ్యానికి భరోసా

- దళారులు కుతంత్రాలకు నష్టాలపాలై నిరాశ



మొక్కల రుగ్మతను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



వ్యవసాయ అధికారులు ఇస్తున్న మందుల చిట్టీ ఇది..

పెంబి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాయా కష్టం చేసి రాత్రనకా పగలనక కష్టపడి పంటలు పండించే రైతన్నలు కాసుల కోసం మధ్య దళారులు చేసే కుతంత్రాలకు గురై తీవ్రమైన నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. కొన్నిసార్లు ప్రకృతి అతివృష్టితో, మరికొన్నిసార్లు అనావృష్టి కారణంగా పంటలపై ప్రతికూల ప్రభావం చూపిస్తూ రైతన్నలను నష్టాల పాలు చేస్తుంటే ఇటు సాగు ఖర్చులో సింహభాగం ఉండే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కల్తీల కారణంగా దళారులు చేసే మోసాల కారణంగా రైతాంగం తీవ్రమైన నిరాశ నిస్పృహలకు లోనవుతున్నాడు. దీనికి తోడు పంటలు పండించడంలో భాగంగా అధిక దిగుబడుల ఆశతో రైతాంగం సైతం నియంత్రణ లేకుండా రసాయనిక ఎరువులు, పురుగు మందులు, శిలీంధ్ర నాశిని మందులను పంటలపై పిచికారి చేయడం వల్ల రైతులపై అవసరమైన అదనపు పంట పెట్టుబడి భారం పెరగడమే కాకుండా వాతావరణ కాలుష్యం, నేల కాలుష్యం, గాలి కాలుష్యానికి కారణమై తదుపరి ఈ పంటలను తీసుకునే వినియోగదారులను సైతం తీవ్రమైన అనారోగ్యాలకు గురిచేస్తుంది. ఈ సందర్భంగా పంటలలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగ మోతాదును నియంత్రించే ఉద్దేశ్యంతో పెంబి మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలో పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

రసాయన రహిత సాగు దిశగా ముందడుగు

మండలంలో రైతులు సాగు చేసే పంట రకాన్ని బట్టి వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించిన మేరకు ఎరువుల విక్రయం జరిగేలాగా చర్యలు తీసుకుంటున్నారు. సాంప్రదాయక యూరియా స్థానంలో నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రసాయన ఎరువుల కారణంగా జరిగే అధిక నేల కాలుష్య తీవ్రతను తగ్గించేలాగా కార్యాచరణ తీసుకుంటున్నారు. సమయానుసారంగా వాతావరణ పరిస్థితులను బట్టి పంటలలో వచ్చే చీడపీడలకు సంబంధించిన ముందస్తు సమాచారం అందించడంతో పాటు రైతులను, ఫర్టిలైజర్ డీలర్లను అప్రమత్తం చేయడం ద్వారా టార్గెట్ పెస్ట్ ఓరియంటెడ్ క్రిమి సంహారక మందుల వినియోగం చేపట్టడం ద్వారా పంటలలో అదనపు రసాయన పురుగు మందుల వినియోగం తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రైతులు తమ పంటలలో ఏదైనా చీడపీఈడల బెడద గమనించినప్పుడు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు తగిన క్రిమిసంహార మందులను వినియోగించేలాగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల చిట్టి లేకుండా హానికరమైన పురుగు మందుల విక్రయం చేపట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. యూరియా బస్తాల విక్రయం తప్పనిసరిగా ఆధార్ లింక్‌తో కూడిన పీవోఎస్ మిషన్‌తో చేపట్టడం ద్వారా ఏ రైతు ఎన్ని బస్తాల మీద యూరియా కొనుగోలు చేస్తున్నాడు అనే విషయాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అగ్రి డాక్టర్ల సలహా పంట ఆరోగ్యానికి భరోసానిస్తుంది. కావునా రసాయన రహిత వ్యవసాయం దిశగా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలకు తోడుగా రైతాంగం సైతం అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ అనతి కాలంలోనే నేచురల్ ఫార్మింగ్, సేంద్రియ వ్యవసాయం దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసి వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా సాగు చేపట్టి తద్వారా నాణ్యమైన ఆహార ధాన్యాల ఉత్పత్తి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధికారుల సూచనల మేరకే మందుల కొనుగోలు

- గుగ్లావత్ సంతోష్, రైతు



ఆరు ఎకరాలలో పత్తి పంట వేశాను. పంటలలో చీడ పీడలు వచ్చిన వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వా రి సూచనల మేరకే క్రిమి సంహారక మందులు కొనుగోలు చేస్తున్నాము. ఇప్పుడు పురుగు మందులపై పెట్టుబడి కొద్దిగా తగ్గింది. ఎరువుల డీలర్లు మేము సాగు చేస్తున్న పంటలను బట్టి తగినన్ని యూరియా బస్తాలను మాత్రమే ఈ-పాస్ మిషన్ల ద్వారా మా ఆధార్ లింక్ చేసి ఇస్తున్నారు.

రసాయన రహిత వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాం..

రాజ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం రసాయన రహిత వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నాము, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే ఎరువులు, పురుగు మందుల విక్రయాలు జరిగేలా డీలర్లను ఆదేశించాం. చీడ పీడల నివారణ కోసం అధికారుల సలహాలు తీసుకునే రైతుల సంఖ్య పెరగడం సంతోషకరంగా ఉంది. ఉన్నతాధికారులు మాకు కేటాయించిన డీలర్ షాపులను నిత్యం పర్యవేక్షిస్తున్నాము.

గుంతల రోడ్డుపై ప్రయాణమెలా..?



జ్యోతి బాపూలే చౌరస్తా నుంచి భైంసా, బాసర రహదారి వరకు ఉన్న రోడ్డు పరిస్థితి

ముథోల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని జ్యోతి బాపూలే చౌరస్తా నుంచి బాసర, భైంసా రహదారి వరకు సుమారు అర కిలో మీటర్ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి నిత్యం హైదరాబాద్, నిజామాబాద్, బోధన్, ధర్మబాద్ రూట్లకు వెళ్లే బస్సులు వయా ముథోల్ బస్టాండ్ చేరుకుని తిరుగు ప్రయాణంలో ఈ రోడ్డు మార్గాన భైంసా, బాసర రహదారికి చేరుకుంటాయి. మరలా భైంసా వెళ్లేటప్పుడు ముథోల్ బస్టాండ్ చేరుకోవాలన్న ఇదే రోడ్డు వెంట వెళ్లాల్సి ఉంటుంది. అయితే రోడ్డు గుంతలు ఏర్పడటంతో ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ముథోల్ వాసులు, ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

భక్త జనం 'కదిలె'

- పాపన్న దర్శనం కోసం బారులు
- దేవిశ్రీ మ్యూజిక్ అకాడమీ వారిచే భక్తి గీతాలాపన



పాపన్న స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

దిలావర్‌పూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్య కదిలె లొద్ది (లోయ)లో కొలువైన శ్రీ పాపహరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శ్రావణ మాసం మొదటి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. నంది గుండంలో పవిత్ర స్నానాలు చేసి స్వామివారి దర్శన భాగ్యం కోసం బారులు తీరారు. అర్చన, అభిషేక పూజలు చేసి తరించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కదిలె లొద్ది కిటకిటలాడింది. స్వామివారి దర్శనం అనంతరం భక్తుల కొంగు బంగారం మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని పూజలు చేశారు.



భక్తి గీతాలు ఆలపిస్తున్న దేవిశ్రీ అకాడమీ బృందం

ఆకట్టుకున్న భక్తి గీతాలాపనలు..

హైదరాబాద్‌లోని దేవిశ్రీ మ్యూజిక్ అకాడమీ వారు సోమవారం కదిలెలో నిర్వహించిన భక్తి గీతాలాపనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ము ఖ్యంగా చిన్నారులు అన్విక, శ్రీముఖిలు ఆలపించిన భక్తి గీతాలకు భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు.

వేల మందికి అన్నప్రసాదం

శ్రావణ మాసం మొదటి సోమవారం స్వామివారి దర్శనం కోసం వచ్చిన వేల మందికి భైంసా పట్టణానికి చెందిన తుంగెన సౌమ్య ధర్మారావు, చీకోటి అర్చన, వెంకటేష్ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం చైర్మన్ వెంకట్రావు, పాలకవర్గ సభ్యులు రమేష్ తదితరులు పర్యవేక్షణ చేశారు.

నాగుల పంచమికి నాగోబా ఆలయం ముస్తాబు



నాగుల పంచమికి ముస్తాబైన నాగోబా ఆలయం



మినీ జాతరలో వెలిసిన రంగుల రాట్నాలు



భైంసాలో పంచమి ప్యాలాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- మినీ జాతరకి అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్

ఇంద్రవెల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జరిగే నాగుల పంచమి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా నిర్మించిన ఆలయంలో ప్రతియేటా నాగుల పంచమి ఉత్సవాలు రెండు రోజులు పాటు నిర్వహిస్తారు. మంగళవారం, బుధవారం రెండు రోజులు నిర్వహించే ఉత్సవాలకు ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్ తెలిపారు. నాగుల పంచమి సందర్భంగా దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యాల కోసం ఆలయ కమిటీతో పాటు మెస్రం వంశీయులు, గ్రామస్తులు అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తుల కోసం ప్రత్యేక దుకాణాలు, స్టాల్‌తో పాటు రంగుల రాట్నాలు, చిన్నపిల్లలు ఆడుకునే ఆటలను సైతం మినీ జాతరలో వెలిశాయి. శ్రీ నాగోబా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ జాతరలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను సైతం నిర్వహించనున్నారు. ఈ కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 10వేలు, రెండవ బహుమతి 5వేలు అందజేయనున్నట్లు యూత్ ప్రెసిడెంట్ మెస్రం షేక్‌నాథ్ తెలిపారు. ఈ మినీ జాతరలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్‌కు నాగ పంచమి కళ

భైంసా: కొంత కాలంగా నామమాత్రపు కొనుగోళ్లతో వెలవెలబోయిన భైంసా మార్కెట్ నాగపంచమి కొనుగోళ్లతో సోమవారం కళకళలాడింది. అధిక సంఖ్యలో ప్రజలు కొనుగోళ్ల కోసం గాను ఇక్కడికి తరలిరావడంతో ఇన్నాళ్లుగా బోసిపోయిన స్థానిక మార్కెట్ సందడిగా కనిపించింది. ప్రధానంగా వస్త్ర వ్యాపారపు సంస్థలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇతర ప్రాంతాల్లోనున్న ఇంటి ఆడపడుచులు నాగ పంచమిని పురస్కరించుకొని పుట్టింటికి తరలిరావడంతో స్థానిక బస్టాండ్ కోలాహలంగా కనిపించింది. చాలా రోజుల తదుపరి భైంసా మార్కెట్ కొనుగోళ్ల ప్రక్రియతో కొత్త శోభను సంతరించుకుంది. పంచమి పండుగలో భాగంగా నాగ దేవతకు పూజలు నిర్వహించిన అనంతరం సోదరిమణులంతా తమ తమ సోదరులకు కళ్లను కడుగడం అచారంగా కొనసాగుతోంది. ఇదే క్రమంలో కళ్లను కడిగిన సోదరీమణులకు సోదరులు కట్న, కానుకలు, నూతన వస్త్రాలను సమర్పిస్తుంటారు.వీటన్నింటి కొనుగోళ్లు సోమవారం ఇక్కడి మార్కెట్‌లో అధిక మొత్తంలో జరిగాయి. దీంతో పాటు నాగ పంచమి పర్వదినమున ప్ర సాదంగా అందించే పంచమి ప్యాలాలకు భలే గిరాకి జరిగింది. మార్కెట్ పరిధిలోని ప్రధాన కూడలీల్లో పలువురు వ్యాపారులు తోపుడు బండ్ల ద్వారా ఈ ప్యాలాలను విక్రయించారు.



ఈ బండి నాది..దిగను పో

- బైక్‌పై మారం చేస్తున్న వానరం

ఇది నా బండి.. నేను ఇవ్వను.. కావాలంటే నడుచుకుంటూ పో అంటుంది ఈ వానరం.. ఇచ్చోడ సమీపంలో జాతీయ రహదారి పక్కన అపి ఉన్న ద్విచక్రవాహనంపైన ఎక్కిన కోతి దిగనని మారం చేసింది. ద్విచక్ర వాహనం వద్దకు వెళ్లేందుకు యత్నించిన యజమాని పైకి కోపంగా చూస్తూ అరిచింది. చాలా సేపు బైక్‌పై అలానే కుర్చున్న వానరం.. తర్వాత పక్కన పంట చేన్లలోకి వెళ్లింది. కోతి బైక్ మీద నుంచి తానంతట తాను వెళ్లే వరకు బైక్ యజమాని తన వాహనాన్ని తీసుకోలేక పోయాడు. ● (ఇచ్చోడ, ఆంధ్రజ్యోతి)

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



రవీంద్ర నగర్‌లోని ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు




గంగాపుత్ర శివాలయం వద్ద ..

ఆదిలాబాద్ టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో తొలి సోమవారం ప్రసిద్ధ ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. ముఖ్యంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని గంగాపుత్ర శివాలయంతోపాటు రవీంద్ర నగర్ లోని ఉమా మహేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచే బారులు తీరిన భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజాది క్రతువులతో భోలా శంకరుడిని ఆరాధించారు. శివలింగాలను బిల్వ పత్రంతో పూజించి, పాలతో అభిషేకించి మొక్కులు చెల్లించుకున్నారు. నవగ్రహాలకు పూజలు చేసి దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తులను చాటారు. పరమశివుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకోవడంతో ఆయా ఆలయ ప్రాంగణాలు సందడిగా కనిపించాయి. ప్రత్యేక పూజలు జరిపి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



శివ లింగానికి అభిషేకం భక్తులు





రత్నాపూర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి న దృశ్యం



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టు శ్రీకాంత్

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసకాకూడదని, జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని, వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్టు శ్రీకాంత్ అన్నారు. సోమవారం బంగారిగూడలోని కస్తూర్బా బాలిక విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని, ప్రణాళికాబద్ధమైన జీవనంలో అనుకున్నది సాధించవచ్చని, ప్రపంచంతో పోటీపడి ఉన్నత స్థానాలను అధిరోహించాలని తెలిపారు. పొగాకు ఉత్పత్తులు, మత్తుపదార్థలకు దూరంగా ఉండాలని, పొగాకు వాడకం వలన ప్రాణాంతక వ్యాధులే కాకుండా మానసికంగా కూడా మనిషి కుంగిపోయి ఆత్మహత్యలకు కూడా దారితీయచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ విభాగం సైకాలజిస్టు శ్రీకాంత్, సోషల్ వర్కర్ చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ కవితజాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : వైద్యాధికారి

బజార్‌హత్నూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ భీంరావ్ అన్నారు. మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో ఆయన గ్రామస్థులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. కలుషిత నీటిని తాగకూడదని, ఆహార పదార్థాలను కప్పి ఉంచాలన్నారు. సీజనల్‌గా వచ్చే మలేరియా, టైఫాయిడ్, డెంగీ మొదలగు వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను సద్వినియోగించుకోవాలని వివరించారు.

● క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం

క్షయవ్యాధిపై అందరికీ పూర్తి అవగాహన ఉండాలని డాక్టర్ సుమలత అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన క్షయవ్యాధి ఎక్స్‌రే శిబిరంలో క్షయవ్యాధి పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్ శిల్ప, హెచ్‌ఈఓ సూర్యప్రకాష్, సుశీల, రాణి, దయానంద్, రమేష్, రవి, తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

● రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు రైతులకు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర మాజీ మంత్రి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం సాత్నాల మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల పార్టీ సమావేశానికి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటుతో మోసపోతే ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు మరో మూడేళ్లు మోసం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలను త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ యాసం నర్సింగ్‌రావు, మెట్టు ప్రహ్లాద్, మాజీ జడ్పీటీసీ పెందూరు ఆశారాణి దేవన్న, మార్కెట్ వైస్ చైర్మన్ జి.వేణుయాదవ్, తదితరులున్నారు.

ఢిల్లీలో శిక్షణకు హాజరైన జిల్లా అధికారి

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయంలో మలేరియా నిర్మూలనపై నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ పాల్గొన్నారు. దేశంలో 2027 నాటికి జీరో మలేరియా లక్ష్యాన్ని సాధించేందుకు, మలేరియా నివారణ, నియంత్రణపై అధికారులకు సమగ్ర విజ్ఞానం అందించడమే కార్యక్రమ ఉద్దేశమని ఆయన సోమవారం తెలిపారు. జిల్లాలో 2015వ ఏడాది వరకు మలేరియా ప్రబలంగా ఉందని, అప్పటి నుంచి చేపట్టిన అనేక నియంత్రణ చర్యల ఫలితంగా ప్రస్తుతం కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

● ..సదస్సుకు హాజరుకానున్న జిల్లా ఉపాధ్యాయుడు

ఆదిలాబాద్ టౌన్: నూతన జాతీయ విద్యా విధానంపై ఢిల్లీలోని ప్రగతిశీలత మైదాన్‌లోని భారత మండపంలో ఈనెల 29న జరగనున్న జాతీయ స్థాయి సదస్సుకు పాల్గొనాల్సిందిగా గుడిహత్నూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బెదోడ్కర్ సంతోష్ కుమార్‌కు ఆహ్వానం అందింది. కేంద్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ నుంచి ఆహ్వానం అందడం పట్ల ఆయనను పలువురు అభినందించారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభంకానున్న సదస్సులో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాల నుంచి విద్యారంగ ప్రముఖులు, విషయ నిపుణులు, నేషనల్ మెంటారింగ్ సభ్యులు పాల్గొననున్నారు.



- ఆగస్టు 14తో ముగియనున్న పీఏసీఎస్‌ల పదవీ కాలం
- ప్రాథమిక సభ్యత్వం రద్దుతో డీసీసీబీకి పదవీ గండం
- రెండవ సారి రెన్యూవల్ కోసం మొదలైన పైరవీలు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయమే కీలకం
- పీఏసీఎస్, డీసీసీబీ పాలక వర్గాలలో తీవ్ర ఉత్కంఠ

మిగిలింది 17 రోజులే..

ఆదిలాబాద్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్) పాలక వర్గాల పదవీ కాలం ఆగస్టు 14తో ముగియనుంది. ఇంకా మరో 17 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో డీసీసీబీలకు పదవీగండం తప్పదంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియమించిన పాలకవర్గాలే ఇంకా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో చాలా మంది చైర్మన్లు, డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఉమ్మడి జిల్లాలో 77 ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్)లు ఉన్నాయి. ఒక్కో ప్రాథమిక సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు మొత్తం 1,001 మంది డైరెక్టర్లు కొనసాగుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పీఏసీఎస్‌ల పాలక వర్గాల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడగించింది. ఈ గడువు సమయం కూడా ఆగస్టు 14తో ముగిసి పోనుంది. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని సర్వత్రా ఉత్కంఠ కనిపిస్తుంది. ఒక వేళ ప్రభుత్వం గడువు సమయాన్ని పొడగించకుంటే డీసీసీబీ చైర్మన్‌తో పాటు 77 సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు ప్రాథమిక సభ్యత్వాన్ని కోల్పోనున్నారు.

ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్

పీఏసీఎస్‌ల పదవీ కాలాన్ని పొడగింపు విషయంలో ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్‌గా కనిపిస్తుంది. వచ్చేనెల 14లోపు గడువు సమయం పొడగింపుపై ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. లేక పోతే ఆగస్టు 15 నుంచి సొసైటీలతో పాటు డీసీసీబీ పాలకవర్గం పూర్తిగా రద్దయ్యే అవకాశం ఉంది. మొదట 2020 ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగాయి. దీంతో 2025 ఫిబ్రవరి 15తో ఐదేళ్ల పదవీకాలం ముగిసి పోయింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి రావడం.. ఆ వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యపడదని భావించి మరో ఆరు నెలల పాటు గడువు సమయాన్ని పొడగించింది. దీంతో వచ్చేనెల 14తో ఈ గడువు సమయం కూడా ముగిసపోనుంది. రెండవ సారి పొడగింపు లేకపోతే చైర్మన్లు, డైరెక్టర్ల పదవులు ఊడిన ట్లేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.




ప్రభుత్వంపై ఒత్తిళ్లు

డీసీసీబీ, పీఏసీఎస్ చైర్మన్లుగా కొనసాగుతున్న వారంతా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. దీంతో రెండవ సారి రెన్యూవల్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీబీ చైర్మన్‌తో పాటు పలువురు పీఏసీఎస్ చైర్మన్లు తమకున్న పరిచయాలు, పలుకుబడితో పదవులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే చైర్మన్లకు ప్రొటోకాల్ ఉండడంతో ఈ పదవులకు ప్రాధాన్యత కనిపిస్తుంది. మరో సారి గడువు సమయాన్ని పొడగించాలని ప్రభుత్వంపై ఒత్తిళ్లు తెస్తున్నారు. హైదరాబాద్‌లోనే మకాం వేస్తూ వరుసగా ప్రభుత్వ పెద్దలను కలుస్తూ.. గడువు పొడగింపుపై మాట్లాడుతున్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి, ఎమ్మెల్యేలతో సంబంధిత శాఖ మంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ఒకటి రెండుసార్లు వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి ఈ విషయమై చర్చించినట్లు సమాచారం. దీంతో పలువురు చైర్మన్లు పదవీ కాలం పొడగింపుపై కొంత ధీమాతోనే కనిపిస్తున్నారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి



(తరువాయి 6వ పేజీలో...)



రత్నాపూర్ గ్రామాన్ని సందర్శించిన అధికారులు

● వైద్య శిబిరం ఏర్పాటు

తలమడుగు, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్ ఆదివాసి గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 'మంచమే వారికి అంబులెన్స్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి సోమవారం గ్రామాన్ని సందర్శించారు. దీనిలో భాగంగా అధికారులు, ఎస్సై రాధిక గ్రామానికి వెళ్లి గ్రామ అధ్యక్షుడి ద్వారా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఐటీడీఏ ఏజెన్సీ డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది చిన్నయ్య, తదితరులున్నారు.

స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ మార్గదర్శకత్వంలో వోకల్ ఫర్ లోకల్ ఆత్మను ప్రోత్సహించే ఆకాంక్ష హాట్ అనే ప్రదర్శనను జూలై 30 నుంచి ఆగస్టు 3వరకు స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన స్థానిక మహిళా స్వయంసహాయ సంఘాలు, కళాకారులు, గిరిజన పారిశ్రామికవేత్తలు కలిపికు పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిరిజన సంప్రదాయ తినుబండారాలు, ఔషధ గుణాల కలిగిన ఉత్పత్తులు, చేతితో తయారు చేసిన వస్త్రాలు, ఆర్గానిక్ పంటలు, సాంస్కృతిక అలంకరణ వస్తువులు వంటి స్థానిక ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంటాయని తెలిపారు. జిల్లా ప్రజలు వారిని ప్రోత్సహించాలని సూచించారు.

వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

● కలెక్టర్ రాజర్షి షా ప్రజావాణి ● కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అర్జీదారులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి విభాగంలో 114 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. భూ సమస్యలు, పెన్షన్లు, విద్యుత్, విద్య, వైద్యం తదితర విభాగాలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాగా, పట్టణంలోని మహాలక్ష్మి వాడ కాలనీలో రోడ్డుపై ఓ వ్యక్తి కబ్జా చేసి ఆక్రమించాడని, అధికారులు స్పందించి అడ్డుకోవాలని స్థానికులు కోరారు. అలాగే, రిమ్స్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు పెండింగ్ లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం అందించారు.

● జాబ్ మేళా పోస్టర్ల ఆవిష్కరణ

ఆదిలాబాద్ టౌన్: తెలంగాణ ప్రభుత్వ టాస్క్ ఆర్గనైజేషన్ టాస్క్ స్టేట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆగస్టు 5న పట్టణంలోని ఎస్టీయూ భవనంలో జాబ్ మేళా జరగనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం అధికారులతో కలిసి జాబ్‌మేళా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మేళాలో దాదాపు 20 ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, డీపీవో రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.



కేఆర్కే కాలనీ బస్తీ దవాఖానాను సందర్శించిన కలెక్టర్

● బస్తీ దవాఖానాలో ఆకస్మిక తనిఖీ

మావల: కేఆర్కే కాలనీలోని బస్తీ దవాఖానా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్శనలో దవాఖానలో సరిపడినంత మందుల స్టాక్ ఉందో లేదో అనే విషయాన్ని పరిశీలించారు. అలాగే రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతపై అధికారులను ప్రశ్నించారు. దవాఖాన నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను, రోగుల నమోదు వివరాలను, ఔషధాల జాబితాను, స్టోర్‌రూమ్, అటెండెన్స్ రిజిష్టర్, ప్రయోగశాల పరీక్షలు నమోదు చేస్తుంది, లేనిది, మందులు ప్రాపర్‌గా ఉన్నాయా? లేవా? ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉన్నాయా లేదో చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు అందిస్తున్న తీరును అడిగి తెలుసుకొని, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటిస్తూ శుభ్రంగా ఉనాడాలని సూచించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ వెంకన్న, తదితరులు ఉన్నారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బాధితులకు సరైన సమయంలో న్యాయం జరగాలి : ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగినపుడే పోలీసుల పట్ల గౌరవం, నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను ఆలకించిన ఎస్పీ. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సూచనలు చేశారు. సక్రమమైన విచారణ చేపట్టి బాధితులకు సరైన న్యాయం చేకూర్చాలని ఎస్పీ తెలిపారు. భూ సమస్యలు, ఫోర్జరీ పత్రాలు, భూములను ఆక్రమించుకోవడం, నకిలీ పత్రాలను సృష్టించడం, కుటుంబ సమస్యలు, కుటుంబ కలహాలు తదితర ఫిర్యాదులను ఎస్పీకి ప్రజలు సమర్పించారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు కృషి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య

ఆదిలాబాద్ టౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. సోమవారం తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శివకుమార్ నేతృత్వంలో సంఘం నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం వారికి కావాల్సిన సిలబస్, సమాచారం అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లాలోని అన్ని గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు కృషి చేస్తానని పేర్కొన్నారు. పాఠకుల కోసం అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రాజేష్, వామన్ రావు, అరుణ, సంయుక్త కార్యదర్శి అనిల్, కోశాధికారి రోడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ప్రతీ గ్రామాల్లో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి

తలమడుగు: జిల్లాలోని ప్రతీ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తలమడుగు గ్రంథాలయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు చదువుకున్నప్పుడే సమాజం అన్ని రంగంలో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచం నడుస్తుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలన్నారు. నిరుద్యోగ యువత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ నల్ల పద్మక్క రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, గ్రంథాలయ శాఖ, సెక్రటరీ సునీత, టీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకులు పిడుగు అభిరామ్ రెడ్డి, మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, బజారత్నూర్ కన్వీనర్ పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి చర్యలు : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, జూలై 28(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెన్షన్‌లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పలు సమస్యలను పీఓకు వివరించారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

● గిరిజన క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీలు

ఉట్నూర్: మండల కేంద్రంలో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ మరియు జంగుబాయి గ్రూపు సభ్యులచే నడపబడుతున్న గిరిజన క్యాంటిన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రూపు సభ్యులకు పీవో పలు సలహాలు సూచనలు అందించారు. భోజనం రుచికరంగా వండి పెట్టాలన్నారు. దాదాపుగా 350 మంది భోజనానికి వస్తారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గిరిజన భవన్ సమీపంలో ఉన్న గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోల్, డిజిల్ బంకును ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన ఇందనమందిస్తూ సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ మేనేజర్ నవజ్యోత్, సిబ్బంది, జంగుబాయి గ్రూపు సభ్యులు శేఖర్, అనిల్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లోని జీసీసీ పెట్రోల్‌బంకును తనిఖీ చేస్తున్న..

● గిరిజన విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌ల పంపిణీ

ఉట్నూర్: మండలంలోని గిరిజన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయడం జరిగిందని పీవో ఖుష్బుగుప్తా తెలిపారు. సోమవారం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో ఉన్నత విద్య కోర్సులలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ల్యాప్‌టాప్‌లు అందించారు. ఇందేలో గిరిజన సంక్షేమ జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, డీడీ కార్యాలయం సూపరింటెండెంట్ వేణుమాదవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.